ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 19.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

మంగళవారం 25 నవంబరు 2025



క్లస్టర్, యూనిట్ సభ్యులతో సెల్ఫీ దిగుతున్న మంత్రి సవిత

రైతన్నా.. మీకోసం..!

తొలిరోజే కదిలిన అధికార యంత్రాంగం

- రైతులను కలిసిన ప్రజా ప్రతినిధులు, నాయకులు
- లాభసాటి వ్యవసాయం కోసం పంచసూత్రాలపై అవగాహన
- ఏపీఏఐఎంఎస్ యాప్‌లోని అంశాలపై కూడా..!



హేమావతి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

అనంతపురం అర్బన్, పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లాభసాటి వ్యవసాయం కోసం పంచ సూత్రాలతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన రైతన్నా.. మీ కోసం' కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వెళ్లి పంచ సూత్రాలపై అవగాహన కల్పించడం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు రైతులకు రాసిన లేఖను కరపత్రం రూపంలో రైతులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి అమలు చేస్తున్న, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను సీఎం లేఖలో ప్రస్తావించారు. కొత్త ఆలోచనలు పంచుకుంటూ, మార్పునకు నాంది పలికేందుకు ప్రభుత్వానికి అన్నదాతలు అందరూ తోడ్పడాలని లేఖలో సీఎం కోరారు. డిసెంబరు 3వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. చివరి రోజున గ్రామ సభలు, రైతు సేవా కేంద్రాల

(మిగతా 6లో...)



కొండమనాయుని పాళ్యంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం: కందికుంట

కదిరి అర్బన్: వ్యవసాయాన్ని లాభసాటి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే కందికుంట అన్నారు. కొండమ నాయుని పాళ్యంలో రైతులతో ఆయన మాట్లాడారు. రైతులకు ఇస్తున్న రాయితీలు, వసతుల గురించి తెలియజేశారు. అన్నదాత సుఖీభవ కింద ఇప్పటికే రెండు విడతల్లో రూ.14 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఏ ప్రాంతంలో ఎలాంటి పంటలు లాభదాయకమో గుర్తించి, ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. కాలానికి అనుగుణంగా పంటల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాలకు తోడ్పాటు ఇస్తామని తెలిపారు. ఈ పథకాలను చూసి ఓర్వలేని జగన్, కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పజలు నమ్మి అధికారం ఇస్తే వ్యవస్థల్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు.

మొదటి రోజు ఒక్కరే..

తొలిరోజు కార్యక్రమంలో ఎమ్మెల్యేలో కందికుంట మాత్రమే పాల్గొన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకలలో ఆదివారం వరకూ తీరిక లేకుండా గడిపిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు.. సోమవారం ఈ కార్యక్రమానికి పెద్దగా రాలేదు. మంత్రి సవిత అధికారులతో జరిగిన సమీక్షతో సోమవారం బిజీగా గడిపారు. రెండో రోజు మంగళవారం నుంచి ఎమ్మెల్యేలు క్షేత్రస్థాకికి వెళ్లనున్నారు. కదిరి మండలం కొండమనాయుని పాళ్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి రాములునాయక్, టీడీపీ నాయకులు పర్వీన్ బాను, చెన్నకేశవులు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమరాపురం మండలం హేమావతిలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, హిందూపురం మండలం ఎం బీరేపల్లిలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక గెలుపే ధ్యేయం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె క్లస్టర్ , యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు తమ పరిధిలో శ్రద్ధగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ పదవి దక్కడం గౌరవప్రదమైన అంశమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల నుంచి బయటకు తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నార న్నారు. ఈసందర్భంగా ఆమె యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లస్టర్ యూనిట్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటరమణ, కేశవయ్య, మాధవనాయుడు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, డీవీ ఆంజనేయులు, రెడ్డివారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవపై ప్రచారం

తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవిత వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాకపోవడం, ఈకేవైసీ పూర్తి కాకపోవడం, బ్యాంక్‌ఖాతాలకు అనుసంధానం, ఎన్‌పీసీఎల్ లింక్ సమస్యలు వంటి వాటిపై చర్చించారు. అన్నదాత సుఖీభవ పథకం గురించి ఇంటింటా ప్రచారం చేస్తూ రైతులకు అవగాహన కల్పించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణమీనన్, ఐదు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

అర్జీల పట్ల నిర్లక్ష్యం వద్దు: జేసీ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీల పట్ల నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 93 అర్జీలలను స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరు, ఇంటి పట్టాల కోసం అధికంగా ప్రజలు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య అధికారులు పాల్గొన్నారు.

మడకశిర బైపాస్ కెనాల్ పనులను వేగవంతం చేయండి

హంద్రీనీవా కాలువ మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి

మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వినతి



మంత్రి నిమ్మలకు వినతి పత్రం ఇస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మడకశిర బైపాస్ కెనాల్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఈ మేరకు మంత్రిని సోమవారం ఏపీ సచివాలయంలోని చాంబర్‌లో ఎమ్మెల్యే కలిసి వినతి పత్రం అందించారు. మడకశిర నియోజకవర్గంలో నీటి సమస్యలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన బైపాస్ కెనాల్ విషయంగా సత్వరమే చర్యలు తీసుకోవాలని, పనులు మొదలుపెట్టాలని మంత్రిని కోరారు. బైపాస్‌కెనాల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రికి అందజేశారు. హంద్రీనీవా కాలువల మరమ్మతుల పనుల పురోగతికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గాలికి వదిలివేసిన హంద్రీనీవా మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మడకశిర బైపాస్‌కెనాల్ విషయాన్ని వేగవంతం చేస్తామని, హంద్రీనీవా కాలువల మరమ్మతులకు సంబంధించిన నిధులు విడుదల చేసేందుకు చర్యలు చేపడుతామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రేమ కోసం.. పెళ్లి కోసం..!

ఒకరి ఆత్మహత్య.. మరొకరి యత్నం

సోమందేపల్లి, గుడిబండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఒక యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. పెద్దలు తన పెళ్లి గురించి పట్టించుకోలేదని మరో యువకుడు ప్రాణాలను తీసుకున్నాడు. జిల్లాలో రెండు ప్రాంతాలలో సోమవారం ఈ విషాద సంఘటనలు చోటు చేసుకున్నారు.

- సోమందేపల్లి మండలం రంగేపల్లికి చెందిన సూర్యప్రకాశ్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు, సూర్యప్రకాశ్ గతంలో వలంటీరుగా పని చేసి, ప్రస్తుతం గ్రామంలోనే చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. తనకు పెళ్లి చేయాలని కొన్ని నెలలుగా కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులను అడుగుతుండేవాడు. తన తోటివారికి, బంధువుల పిల్లలకు పెళ్లిళ్లు అవుతున్నాయని, తనకు ఎప్పుడు చేస్తారని ఇంట్లో వారిని నిలదీసేవాడు. పెళ్లికి అప్పుడేం తొందర వచ్చిందని వారు సోమవారం ఉదయం మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సూర్యప్రకాశ్, ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలోని గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గొర్రెల కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.




సూర్యప్రకాశ్

- గుడిబండ మండలం మోపురుగుండు గ్రామానికి చెందిన ఈర రామప్ప, నాగమ్మ దంపతుల కుమారుడు రామాంజి పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఐదేళ్ల నుంచి బెంగళూరులోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఇదే మండలంలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన ఓ అమ్మాయి, రామాంజి పరస్పరం ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఇటీవల నిశ్చితార్థం జరిగింది. వచ్చే నెల 5, 6 తేదీల్లో పెళ్లికి ముహూర్తం పెట్టుకున్నారు. ఈలోపే ఆ అమ్మాయి వేరే అబ్బాయితో వెళ్లిపోయింది. ఈ విషయం తెలియగానే రామాంజి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బెంగళూరు నుంచి గుడిబండకు వచ్చి గొంతు కోసుకున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు.



రామాంజి



సత్యసాయి వేడుకలు సక్సెస్

సర్వత్రా హర్షం 7

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయాలన్న సీఎం

రింగురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

- మాజీ మంత్రి పల్లె 6

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

బాధితులకు సత్వర న్యాయం: ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఎస్పీ సతీష్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. చట్టపరిధిలో ఉన్న ఫిర్యాదులను పరిష్కరిస్తామన్న భరోసాను కల్పించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కుటుంబ కలహాలు, భూసమస్యలు, భార్యాభర్తల గొడవలు, సైబర్‌నేరాలు వంటివాటిపై 50 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కునుకుంట్లలో చీనీ సిరులు

- గ్రామంలోని అందరికీ చీనీ చెట్లు
- రూ.కోట్లలో పంట దిగుబడి
- వేసవిలో నీటి సమస్యతో అవస్థలు

తాడిమర్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో అది ఒక చిన్నగ్రామం. ఆ గ్రామంలో ఓ పది కుటుంబాలు మినహా మిగిలిన అందరికి చీనీ చెట్లు ఉన్నాయి. పోటీలు పడి పెట్టుబడులు పెడుతూ.. చీనీ పంటలో మంచి దిగుబడులు సాధిస్తున్నారు తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామ రైతులు. గ్రామం మొత్తంపైన 531 కుటుంబాలు ఉండగా.. 2,234 మంది జనాబా ఉన్నారు. 519 మంది రైతులకు సంబంధించి 2,120 ఎకరాలలో దాదాపు 2 లక్షల 90వేల చీనీ చెట్లు సాగవుతున్నాయి. వాటిలో ఇటీవల నాటినవి కొన్ని కాగా, ఇప్పటికే దిగుబడి వస్తున్నవి రెండు లక్షల దాకా ఉన్నాయి. గ్రామంలో ప్రతి కుటుంబం దాదాపు చీనీ పంటను నమ్ముకుని జీవనం సాగుస్తున్నారు. ఏటా రూ. కోట్లలోనే ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. పక్క రైతు చీనీపంటకు మందులు వేశారంటే మరుసటి రోజే పోటీపడి పిచికారి చేస్తారు. దిగుబడి కూడా అలాగే సాధిస్తారు. ఒక్కో చీనీ చెట్టుకు 100 నుంచి 150 కిలోల వరకు కాయల దిగుబడి సాధిస్తున్నారంటే.. అదీ ఆ రైతుల పట్టుదలకు నిదర్శనం. ఉమ్మడి జిల్లాలో చీనీ పంట అధికంగా సాగవుతున్న గ్రామాలలో గార్లదిన్నె మండలం ముకుందాపురం మొదటి స్థానంలో ఉండగా.. తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామం రెండో స్థానంలో ఉంటుంది. చీనీ పంట ద్వారా ఆర్జించిన ఆదాయాన్ని ఉపయోగించి పిల్లలను బాగా చదివించుకుని ప్రయోజకులను చేస్తున్నారు. దీంతో చీనీ పంట నుంచి వచ్చే ఆదాయంతో పాటు పిల్లలు ఉద్యోగాల ద్వారా సంపాదనతో గ్రామం మరింత అభివృద్ధిబాట పడుతోంది. గ్రామాన్నంతటిని పీడిస్తున్నది సాగునీటి సమస్య. 2005 సంవత్సరానికి ముందు వరకు ఈ గ్రామం నడిబొడ్డున వెళ్లే పులివెందుల బ్రాంచ్ కెనాల్ ద్వారా హెచ్‌ఎల్‌సీ నీరు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు దాదాపు 5నెలలు వెళ్లేవి. దీంతో భూగర్భ జలమట్టం అభివృద్ధి రైతులకు నీటి కష్టాలు ఉండేవి కావు. గండికోట రిజర్వాయర్ నుంచి చిత్రావతికి లిఫ్టుల ద్వారా నీటి తరలింపు మొదలైనప్పటి నుంచి గ్రామ రైతులకు నీటి సమస్య ప్రారంభమైంది. ప్రతి ఏటా వేసవిలో చీనీ చెట్లను కాపాడుకునేందుకు యుద్ధం చేయాల్సి ఉంటుంది. గ్రామ రైతుల అభ్యర్థన మేరకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ గత ఏడాది తన సొంత నిధులు రూ.8లక్షలు ఉపయోగించి పీబీసీ కాలువ నుంచి గ్రామంలోని దేశాయి సింగప్ప కొండకు ఒక మోటారు ద్వారా నీటిని తరలించేందుకు ఎత్తిపోతల పథకానికి ఏర్పాట్లు చేశారు. ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి కుంటలు, కాలువలకు నీరు అందించేలా చూడాలని రైతులు ఆదినారాయణ, లింగారెడ్డి, నారాయణస్వామి, గంగాధర్ కోరారు.



కునుకుంట్ల వద్ద సాగుచేసిన చీనీ తోట

వేసవిలో ఇబ్బందులు



ప్రతి ఏటా మార్చి నుంచి జూన్‌లో వర్షాలు మొదలయ్యే వరకు చెట్లను బతికించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 నుంచి రూ.1000 వెచ్చించి నీటిని తరలించుకుని చెట్లను కాపాడుకుంటున్నాం. ఎన్నిచెట్లు ఉన్నా అధికంగా దిగుబడులు సాధించాలన్న తపనతో ఎన్ని మందులైనా రాజీపడకుండా పిచికారి చేస్తున్నాం.

- రామాంజనేయరెడ్డి, రైతు

పిల్లలను బాగా చదివించుకుంటున్నాం



చీనీ చెట్లను కష్టపడి బతికించుకుంటే.. అవి మమ్ములను బతికిస్తున్నాయి. చీనీ చెట్లు దిగుబడి బాగా వచ్చి ఒక ఏడాది ధర తగ్గినా.. మళ్లీ ఏడాది ధర బాగా పలికి లాభాల బాట పట్టిస్తున్నాయి. దీంతో పిల్లను బాగా చదివించుకుంటున్నాం. ఇలా పది సంవత్సరాలు కష్టపడితే పిల్లలు స్థిరపడి మా కుటుంబాలు బాగుపడతాయి.

- అక్కులప్ప, రైతు

నిత్యం మందులు కొట్టాలి



మాకు 5,600 చీనీ చెట్లు ఉన్నాయి. పూత రావడం మొదలయిందంటే ప్రతి రోజూ ఒక వైపు నుంచి ఏదో ఒక రకం మందు కొట్టాలి. లేదా మందులు వేయాలి. పక్క రైతుకంటే బాగా పంట దిగుబడి సాధించాలనే పోటీతత్వం మా గ్రామంలో ఎక్కువగా ఉంది. నీటి సమస్య ఎదురైనప్పుడు బాగా ఇబ్బందులుపడుతున్నాం. వ్యవసాయమే మాకు జీవనాధారం.

- వడ్డి శివారెడ్డి, రైతు

సాగునీటి సమస్య పరిష్కరిస్తాం

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న అధికారులు, బీజేపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సాగునీటి సమస్యను తీర్చడానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్టు బీజేపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ఈ మేరకు రామగిరి, కనగానపల్లి మండలాల వద్ద నీటిని తరలిచే మార్గాలు, సాంకేతిక అంశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ ప్రణాళిక అమలైతే ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 30 నుంచి 40 చెరువులకు దాదాపు టీఎంసీ నీరు అందే అవకాశం ఉందన్నారు. తద్వారా తాడిమర్రి, బత్తలపల్లి మండలాల పరిసర గ్రామాల ప్రాంతాలలోని వేలాది మంది రైతులకు సాగునీటి కొరత తీరుతుందని వివరించారు. రబీ సీజన్‌లో పంటలు వేసుకోవడానికి తక్షణం నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ అధికారులు శ్రీనివాసులు, రాఘవేంద్రరావు, సంతోష్‌నాయక్, రామాంజినాయక్, బీజేపీ నాయకులు ఆకులేటి వీరనారప్ప, బిల్లే శీన, పోతుకుంట రాజు, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

30లోపు పది పరీక్ష ఫీజు చెల్లించండి

జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్ 7

నీటి విడుదలపై నీలినీడలు..!

మరమ్మతులకు నోచని పీఏబీఆర్ కుడికాలువ గేట్లు

కిందికి దిగని జల విద్యుత్ కేంద్రం గేటు

350 క్యూసెక్కుల నీరు వృథాగా బయటకు..



కుడికాలువ గేటును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కూడేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లోని కుడికాలువ గేట్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా కుడికాలువకు నీరు విడుదల చేసే గేటు సక్రమంగా పని చేయకపోవడంతో ఇరిగేషన్ అధికారులు మెకానిక్‌లతో తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. ఈ ఏడాది పీఏబీఆర్ డ్యాంకు హంద్రీ-నీవా, తుంగభద్ర డ్యాం నుంచి నీరు పెద్ద ఎత్తున వస్తోంది. నీటి మట్టం 5 టీఎంసీలకు దాటింది. దీంతో ఇరిగేషన్ అధికారులు జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో నీటిమట్టం 435.600 మీటర్ల వద్దకు చేరుకొని 5.271 టీఎంసీల నిల్వ ఉంది. హంద్రీ-నీవా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 860 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని అధికారులు తెలిపారు. పీఏబీఆర్ నుంచి కుడికాలువ ద్వారా 112 కిలో మీటర్ల దూరంలోనున్న చెరువులకు నీటిని సరఫరా చేస్తారు. కొన్ని సంవత్సరాలుగా కుడికాలువకు నీరు వదిలే గేట్లు రెండు మరమ్మతులకు నోచుకోలేదు. డ్యాం నిర్మాణ సమయంలో అమర్చిన గేట్లకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. రెండ్రోజుల క్రితం పరిశీలించిన అధికారులు గేటుకు మరమ్మతులు చేయాల్సిందేనని నిర్ధారణకు వచ్చారు. మెకానిక్‌ల ద్వారా మరమ్మతులు చేయించేందుకు కసరత్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

హంద్రీ-నీవా, తుంగభద్ర డ్యాం నీరు పీఏబీఆర్‌లోకి ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీరు వెళ్లే గేటు కు మొరాయించడంతో జెన్‌కో అధికారులు ఆపసోపాలు పడి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కొన్ని రోజులు విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఈనెలలో కుడికాలువకు నీరు విడుదల చేయడానికి సమయం ఆసన్నం కావడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని ఇరిగేషన్ అధికారుల నుంచి జెన్‌కో అధికారులకు సమాచారం పంపారు. దీంతో మూడు రోజుల క్రితం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. డ్యాం నుంచి జల విద్యుత్ కేంద్రంలోకి నీరు రాకుండా గేటు బంద్ చేయడానికి వెళ్లిన జెన్‌కో అధికారులకు చమటలు పట్టాయి. గేటు కిందికి దిగకపోవడంతో దాదాపు 345 క్యూసెక్కుల నీరు జల విద్యుత్ కేంద్రం గేటు నుంచి మిడ్ పెన్నార్ డ్యాంలోకి వృథాగా బయటకు వెళుతోంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. తక్షణం గేటు బంద్ చేయాలని, లేకుంటే నీరు బయటకు వృథాగా వెళుతుందని ఇరిగేషన్ డీఈ వెంకటరమణ సూచించారు. దీంతో జెన్‌కో అధికారులు గేటును కిందికి దించడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మెకానిక్‌లతో మరమ్మతులు చేయిస్తున్నారు.

మరమ్మతుల తర్వాతే నీటి విడుదల

పీఏబీఆర్ డ్యాం కుడికాలువ నుంచి నీరు విడుదల చేయడానికి గేటు మరమ్మతుల్లో ఉంది. రెండ్రోజుల్లో గేటు మరమ్మతులు చేయడానికి సంబంధిత మెకానిక్‌లు వస్తున్నారు. కుడికాలువకు ఉన్న రెండు గేట్లు రిపేరి ఉండటంతో నీరు విడుదల సాధ్యం కాదు. దీంతో మరమ్మతుల అనంతరం కుడికాలువకు నీరు విడుదల చేస్తాం. ఒక్కరోజులోనే గేటు రిపేరి పూర్తయితే అనుకున్న సమయానికి నీరు వదులుతాం. లేకపోతే మరింత సమయం పట్టవచ్చు.

– సుధాకర్ రావు, ఎస్ఈ, జలవనరుల శాఖ

బాలల రక్షణ మన బాధ్యత

జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



విద్యార్థులకు బ్యాడ్జీలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. జిల్లాలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ పాల్గొని కిశోరి వికాస బ్యాడ్జిలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో అబ్బాయిల కోసం యువ, అమ్మాయిల కోసం సఖి అనే పేర్లతో గ్రూపులను ఏర్పాటు చేసి, నాయకత్వ బాధ్యతలు చేపట్టే వారికి ఈ బ్యాడ్జీలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పీడీ ప్రమీల, డీఈఓ క్రిష్టప్ప, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరం

అనాథ పిల్లల దత్తత తీసుకునేవారు.. చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా దత్తత తీసుకుంటే అన్ని విధాల శ్రేయస్కరమని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన దత్తత అవగాహన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పిల్లలను చట్టపరమైన ప్రక్రియల ద్వారా మాత్రమే దత్తత తీసుకోవాలని సూచించారు.

వక్కల లెక్క తేలింది

కిలో రూ.570... నోటీసులకు ఆదేశం

ఒక్కో వాహనానికి రూ.1.20 కోట్లు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వక్కల లెక్క తేలింది. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేశారు. ఈనెల 18న కర్ణాటక నుంచి ఢిల్లీకి అక్రమంగా వక్కలు తరలిస్తుండగా మూడు వాహనాలతో పాటు మరో వాహనంలో గుట్కా తరలిస్తూ పన్నుల శాఖకు అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఒక్కో వాహనంలో 20 నుంచి 22 టన్నుల వరకు వక్కలు తరలిస్తూ ఎలాంటి బిల్లులు లేనట్లు అధికారుల పరిశీలనలో తేలింది. వక్కలు కిలో ఎంత ధర పలుకుతోందో తేల్చడానికి కర్ణాటక రాష్ట్రంలోని తుంకూరుకు వక్కల శాంపిల్స్ పంపారు. అక్కడ ఆ వక్కలు కిలో రూ.570 పలుకుతున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఆ మేరకు ఒక్కో వాహనంలో 20వేల కిలోల వక్కలు తరలిస్తున్నారు. జీఎస్టీ ఎగవేసినందుకు ఆ మేరకు ఒక్కో వాహనానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.30 కోట్ల వక్కల అసలు ధర చెల్లించేలా నోటీసులు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అదేవిధంగా ఒక్కో వాహనానికి రూ.6 లక్షల చొప్పున జరిమానా విధించాలని ఆదేశించినట్లు సమాచారం.

డ్రైడే కొనసాగించాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు కొనసాగించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వాటర్, శానిటేషన్ మిషన్ కమిటీ మీటింగ్‌ను ఆర్‌డబ్ల్యుఎస్, డీపీఓ, జడ్పీ, అగ్రి, హెచ్‌ఎల్‌సీ, డ్వామా, మైనర్ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, దేవాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను కట్టించాలని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ రెండు చొప్పున వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసుకుని వాటిని పూర్తి చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీఓ నాగరాజునాయుడు, డ్వామా పీడీ సలీమ్‌బాషా, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

'దుర్గం' మున్సిపాలిటీకి గ్రేడ్ వన్ హోదా

రాయదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పురపాలక సంఘానికి గ్రేడ్ వన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవ తీసుకుని గ్రేడ్-2 హోదా నుంచి గ్రేడ్ వన్‌గా అప్‌గ్రేడ్ కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై పూర్తిస్థాయిలో నివేదికలను తీసుకుని పరిశీలించిన అనంతరం గ్రేడ్ వన్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాయదుర్గం పురపాలక సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించే నిధుల కోటా పెరుగనుంది. అదే విధంగా సిబ్బంది కూడా అదనంగా పెరుగనున్నారు. గ్రేడ్ 2 హోదా కల్పించి 20 సంవత్సరాలకుపైగా కావడంతో పట్టణ విస్తరణ జరిగిన నేపథ్యంలో గ్రేడ్ వన్ హోదా పొందడానికి అవసరమైన అర్హతలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి ఉత్తర్వులను జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న జిల్లా స్థాయి పారా క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. ఈనెల 26న నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో పారా అథ్లెటిక్ పోటీలు ఉంటాయన్నారు. అదే రోజు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ పారా క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు డిసెంబరు 3న నిర్వహించే అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.

రబీలో సబ్సిడీతో వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్‌లో జిల్లాకు 7,300 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారన్నారు. ఇందులో కే-6 రకం 6వేల క్వింటాళ్లు, టీసీజీఎస్ - 1694 రకం 1300 క్వింటాళ్లు కేటాయించామని తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.9200 నిర్ణయించారన్నారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3,680 పోను రైతు వాటా కింద రూ.5,520 చెల్లించాలని పేర్కొన్నారు.

84 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు

అనంతపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 84 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. డిసెంబరు 5, 14వతేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంత జిల్లాలో 45, సత్యసాయి జిల్లాలో 39 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 2019 సంవత్సరంలో జిల్లా గొర్రెల సహకార సంఘం ఎన్నికలకు ప్రభుత్వం స్టే విధించింది. తాజాగా ఎన్నికల నిర్వహణకు విధించిన స్టే ఎత్తేశారు. ఉమ్మడి జిల్లాలో 215 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలు ఉన్నాయి. 131 సంఘాలకు ఇదివరకే ఎన్నికలు జరిగాయి. ఇంకా 84 సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆయా సంఘాలకు ఎన్నికలు పూర్తి చేసిన తర్వాత జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నారు.

రైతన్నా.. మీకోసం..!

(5వ పేజీ తరువాయి)

సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తారు.



రైతన్న మీకోసం కరపత్రాలను రైతులకు అందజేస్తున్న డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ తదితరులు

పరికరాలు ఇవ్వండి: రైతులు

గార్లదిన్నె, శింగనమల: ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలు ప్రాంతాల్లో రైతులు తమ సమస్యలను వివరించారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె రైతులు తమకు రాయితీతో వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారులు 52 మంది రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పశువులు లేనికారణంగా సేద్యపు పనులకు ఇబ్బందిగా ఉందని, రాయితీతో యంత్రాలను ఇవ్వాలని తరిమెల రైతులు కోరారు. అన్నదాత సుఖీభవ, ఎరువులు, విత్తనాల పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేశారు. పండించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కూడా రైతులు విన్నవించారు.

కూటమితోనే రైతు సంక్షేమం: నెట్టెం

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ అన్నారు. ఆలమూరులో వ్యవసాయశాఖ అధికారి వెంకటకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరి, సంజీవులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచసూత్రాలు

సీఎం చంద్రబాబు రైతులకు రాసిన లేఖలో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రి టెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచ సూత్రాల వివరాలు ఉన్నాయి. వచ్చే ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు పంచసూత్రాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామని సీఎం ఆ లేఖలో పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు ఏం చెప్పారు..?

నీటి భద్రత: రాష్ట్రంలో ప్రతి ఎకరానికీ సాగునీరు అందించే దిశగా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో అన్ని ప్రాజెక్టులు నిలుపుతామం.

డిమాండ్ ఆధారిత పంటలు: మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటల సాగు పద్ధతులను మార్చుకోవాలి. పంటల మార్పిడి పాటించాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు తదిత పంటలకు మళ్లీ డిమాండ్ వచ్చింది. చిరుధాన్యాల సాగు మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున పాటించాలి.

అగ్రిటెక్: పంటల సాగుకు టెక్నాలజీ తోడైతే రైతులకు తిరుగుండదు. అందుకే ప్రభుత్వం అగ్రిటెక్‌ను ప్రోత్సహిస్తోంది. ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పథకంలో ప్రతి రైతు యూనిక్ ఐడీల నమోదు చేస్తున్నారు. అవసరమైన రైతులందరికీ బిందు, తుంపర సేద్య పరికరాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతులకు వ్యక్తిగతంగా యంత్రాలు సరఫరా చేయడంతోపాటు కిసాన్ డ్రోన్లు అందజేస్తోంది. పంటల ఆరోగ్య స్థితిని అంచనా వేసేందుకు శాటిలైట్ టెక్నాలజీని వాడుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్: పండించిన పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలి. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్ల పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సీఐఐ సదస్సులో ఎంఓయూలు కుదుర్చుకుంది. ఎంటర్‌ప్రెన్యూర్ తరహాలో అగ్రిప్రెన్యూర్ రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అందుకు నాంది పలుకుతుంది.

ప్రభుత్వం నుంచి మద్దతు: రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అందిస్తున్నాం. పంటనష్టం జరిగితే ప్రధాన పంటలకు హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25 వేలు అందజేస్తున్నాం. పీఎం ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను అమలు చేస్తున్నాం. మామిడి పంటను బీమా పరిధిలోకి తెచ్చాం. ఎఫ్‌పీఓలు, ఎంఎస్ఎంఈలు, బిగ్ రిటైలర్ కంపెనీలతో అనుసంధానం చేసి, సమర్థవంతమైన మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేస్తున్నాం. పాడి రైతులకు అండగా నిలుస్తున్నాం. పశు సంవర్ధక రంగంలో దేశంలో మొదటి మూడు స్థానాల్లో రాష్ట్రాన్ని నిలిపేందుకు పాలు, మాంస ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తోంది. మెగా డీఎస్సీ నిర్వహించింది.

ఏపీఏఐఎంఎస్ యాప్

గ్రామాలవారిగా రైతులు, వారు సాగు చేసిన పంటల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. పంటలకు తెగులు సోకితే, వాటి వివరాలు, నివారణ చర్యలను అధికారులు పొందుపరుస్తారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితి, రాబోవు ఐదు రోజుల్లో వర్షసూచనల వివరాలు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను పొందుపరుస్తారు. భూసార పరీక్షల ఆధారంగా ఏ ఏ రకాల ఎరువులు, ఎంత మోతాదులో వేసుకోవాలో యాప్‌లో ఉంటాయి. ఆ వివరాలను ఎలా చూడాలో రైతులకు అధికారులు అవగాహన కల్పించారు.

విజయ దీపిక

అంధుల ప్రపంచ కప్ అందించిన కెప్టెన్.. జిల్లావాసి



దీపిక తల్లిదండ్రులకు సత్కారం



ప్రపంచ కప్‌తో దీపిక

మడకశిర/టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అకుంఠిత దీక్షతో క్రికెట్‌లో ప్రతిభ చూపింది. అద్వితీయ నాయకత్వ పటిమతో భారత జట్టు అంధుల టీ-20 క్రికెట్ ప్రపంచకప్ సాధించేలా చేసింది. ఆమె మరెవరో కాదు అమరాపురం మండలం తంబాలహట్టి గ్రామానికి చెందిన చిక్కతిమ్మన్న, చిత్తమ్మ దంపతుల కూతురు దీపిక. దీపికకు ఐదు నెలల వయసులో చేతి వేలి గోరు తగలడంతో ఒక కన్ను చూపు పోయింది. సరిహద్దులో వీరి ఊరు ఉన్నందున నాలుగో తరగతి వరకు కర్ణాటకలోని ఓ పాఠశాలలో చదివింది. అందరూ అంధురాలు అని ఏడ్పిస్తుండటంతో, తల్లిదండ్రులు మైసూరులోని అంధుల పాఠశాలలో చేర్చారు. అప్పటికీ హేళన ఆగలేదు. అదే ఆమెలో పట్టుదలను పెంచింది. ఉన్నత స్థితికి ఎదిగి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె సంకల్పించుకుంది. ఆమె పట్టుదల ముందు వైకల్యం చిన్నబోయింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రికెట్ ఆడటం ప్రారంభించింది. కేవలం రెండెకరాల పొలం ఉన్న ఆమె తల్లిదండ్రులు, వర్షాధారంగా పంటలు సాగు చేస్తూ, కూలి పనులకు వెళుతూ దీపికను పోషించారు. ఎనిమిదో తరగతి నుంచి క్రికెట్‌లో దీపిక మైసూరు అంధుల పాఠశాలలోనే శిక్షణ పొందింది. పదో తరగతి చదువుతున్న సమయంలో అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని సెంచరీ సాధించింది.

ప్రపంచ కప్‌లో..

తొలిసారిగా నిర్వహించిన మహిళా అంధుల టీ-20 ప్రపంచకప్ పోటీలో భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా టైటిల్ నెగ్గడంలో దీపిక సారథ్య ప్రతిభ ఎంతో కనిపిస్తుంది. లీగ్ దశలో పాకిస్తాన్‌పై 48 పరుగులు, సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 98 పరుగులు చేసి మ్యాచ్‌లను గెలిపించింది. కాగా ప్రపంచ విజేతగా నిలిచిన భారత జట్టులో ఇద్దరు తెలుగు యువతులు ఉండటం గమనార్హం. దీపిక తొలుత కర్ణాటక జట్టు కెప్టెన్‌గా పని చేశారు. అనంతరం భారత జట్టులో చోటు దక్కింది. 2023లో ఇంగ్లండ్‌లో నిర్వహించిన టోర్నీలో అద్భుత ఆటతీరుతో క్రీడాభిమానులను ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో క్రీడా కోటాలో ఆమెకు ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఉద్యోగం లభించింది.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ అభినందన

దీపికను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారి స్వగ్రామానికి వెళ్లి, దీపిక తల్లిదండ్రులను సన్మానించారు.

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయాలన్న సీఎం

రింగురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు: మాజీ మంత్రి పల్లె

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని తీర్చిదిద్దాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో సోమవారం ఆయన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి విన్నపం మేరకు పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలను కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణం, బుక్కపట్నం చెరువులో బోటింగ్, సత్య సాయి విగ్రహం ఏర్పాటు, టూరిజం గెస్ట్ హౌస్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి డీపీఆర్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారని తెలిపారు. సత్యసాయి శతజయంతి వేడుకలను వేడుకలు ప్రశాంతంగా ముగియడానికి కృషి చేసిన ప్రభుత్వం, రాష్ట్ర మంత్రుల కమిటీ, జిల్లా కలెక్టర్, ఎస్పీ పాటు పాలుపంచుకున్న అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నా అదృష్టం: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి నియోజకవర్గం తొలి మహిళా ఎమ్మెల్యేగా సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు తన హయాంలో నిర్వహించుకోవడం తన అదృష్టమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. వేడుకలు విజయవంతంగా ముగియడానికి చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, రాష్ట్ర, జిల్లా యంత్రాంగం, సత్యసాయి భక్తులు, ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధిలో సత్యసాయి భక్తులు భాగస్వాములు కావాలన్నారు.

ఉద్యోగోన్నతుల్లో అక్రమాలను నిగ్గు తేల్చాలి

కౌన్సెలింగ్ వాయిదా వేయాలి

డీపీఓతో సంఘాల నాయకుల వాగ్వాదం



డీపీఓకు వినతి పత్రం ఇస్తున్న సాకే హరి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించడంలో భాగంగా తయారు చేసిన జాబితాలో తప్పులతడకలుగా సాగాయి. వాటిని నివృత్తి చేసే వరకు కౌన్సెలింగ్ నిర్వహించడానికి వీలులేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం పలువురు డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. డీపీఓ నాగరాజనాయుడు అందుబాటులో లేకపోవడంతో.. ఏఓ నాగరాజును కలిసి సమస్యలపై చర్చించారు. డీపీఓతో చర్చించాలని చెప్పడంతో ఆయన వచ్చే వరకు అక్కడే వేచి చూశారు. డీపీఓ నాగరాజనాయుడు కార్యాలయంలోకి వచ్చిన తరువాత జేఏసీ నాయకులు ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. ఏఓను కలిసి వివరించాలని తెలిపారు. దీంతో నాయకులు ఏఓ నాగరాజుకు సమస్యలను విన్నవించారు. గ్రేడ్-5 కార్యదర్శులకు సంబంధించి ఎన్ని ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్ని భర్తీ చేస్తున్నారన్నది ప్రశ్నించారు. కేవలం 120 మాత్రమే ఉద్యోగోన్నతి ద్వారా జాబితా తయారు చేశారు. అనంతరం డీపీఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా ఎస్సీ గేటగిరిలో గ్రూప్-2 కేటగిరి కింద ఒకరికి కూడా ఉద్యోగోన్నతి కల్పించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని డీపీఓకు వివరించారు. మంగళవారం నిర్వహించే కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తే కలెక్టర్‌ను సంప్రదించి అందరికి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని డీపీఓ నాగరాజనాయుడుతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారి డిమాండ్ మేరకు మంగళవారం నిర్వహించాల్సిన ఉద్యోగోన్నతుల కౌన్సిలింగ్ వాయిదా వేశారు. అనంతరం సమస్యతో కూడిన వినతిపత్రాన్ని డీపీఓకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఓబిలేసు, రామక్రిష్ణ, బాధిత సిబ్బంది మైలారప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆగడాలను అరికట్టండి

ఎస్పీకి టీడీపీ నేతల వినతి

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో వైసీపీ నాయకుల దాడులు శాంతి భద్రతలను దెబ్బతీసేలా ఉన్నాయని, వారిని కట్టడి చేయాలని టీడీపీ నాయకులు ఎస్పీని కోరారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ జగదీష్‌ను టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయినగర్‌లోని ఆసుపత్రిపై వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీల అనుచరులే దాడికి పాల్పడ్డారని అన్నారు. సుమారు 30 మంది రౌడీ మూకలతో వచ్చి ధ్వంసం చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచరుడు సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మరికొందరు రౌడీ మూకలు పాల్గొన్నారని అన్నారు. ఈ ఘటనలో మూడు కోట్ల ఆస్తులు నష్టం జరిగిందని తెలిపారు. వైసీపీ నేతల చర్యలతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ, నాయకులు సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, మోహన్‌కుమార్, చేపల హరి, కాయగూరల శ్రీధర్, ఇస్మాయిల్, గోపాల్, మహమ్మద్‌రఫీ, రామలింగం పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌లో 99 వినతులు..

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జగదీష్ ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వినతులు ఇచ్చిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.



ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

విజేతలు వీరే..!

● సత్యసాయి శతజయంతి సందర్భంగా వ్యాసరచన పోటీల నిర్వహణ



బహుమతులు పొందిన విద్యార్థులు

పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వ్యాసరచన పోటీలను మూడు విభిన్న స్థాయిలలో నిర్వహించారు. హైస్కూలు స్థాయిలో విద్యార్థులకు (డ్యూటీ ఈజ్ గాడ్), ఇంటర్‌కు(టుమారో ఫ్యూచర్ డిపెండ్స్ ఆన్ వాట్ వుయ్ డు టుడే), డిగ్రీ స్థాయిలో(ట్రాన్స్‌ఫార్మ్ యువర్ సెల్ఫ్ టు ట్రాన్స్‌ఫార్మ్ ది వరల్డ్) వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొత్తం 4,182 విద్యాసంస్థలకు గాను 1,73,030 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వీరిలో 3,360 పాఠశాలల నుంచి 1,32,136 మంది, 566 జూనియర్ కళాశాలల నుంచి 25,684 మంది, 256 డిగ్రీ కళాశాలల నుంచి 15,210 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలు పూర్తయిన తర్వాత రాష్ట్ర స్థాయిలో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో ప్రతిభ చూపి, విజేతలైన ఆరుగురికి రాష్ట్రస్థాయి బంగారు పతకం అందజేశారు. సాయికుల్వంత్ హాలులో ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హిమవాహ్ని రత్నాకర్, కమలా పంఢ్యా (జాతీయ విద్యా విభాగ సమన్వయకర్త), డాక్టర్ ఎల్.శశిబాల (జాతీయ సేవా విభాగ సమన్వయకర్త-మహిళ) నీతా ఖన్నా(జాతీయ ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త-మహిళ) చేతుల మీదుగా విజేతలకు బంగారు పతకాలను అందజేశారు.

కృత్రిమ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు కృత్రిమ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధి పరుచూరు రమేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ వంటివి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతిఏటా తమ పరిషత్ ఆధ్వర్యంలో జైపూర్ కాలు కంటే నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హత గల దివ్యాంగులు డిసెంబరు 13 లోపు 98495 08904 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు హెచ్చెల్సీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట్ల వీఆర్‌ఏ వెంకటరాముడు(50) మృతి చెందాడు. సంజీవపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు ఎర్రగుంట్ల వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే తహసీల్దార్ కార్యాలయంలో విధులు ముగించుకుని తమ గ్రామానికే చెందిన ఈశ్వర్ ద్విచక్ర వాహనంపై వీఆర్‌ఏ వెంకటరాముడు బయల్దేరాడు. అయితే మర్తాడు హెచ్చెల్సీ వద్ద ద్విచక్రవానం అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన వీఆర్‌ఏ వెంకటరాముడును 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈశ్వర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

బ్రిడ్జి నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..



మృతి చెందిన వ్యక్తి

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లాక్ టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో బ్రిడ్జి పైనుంచి కింద ఉన్న రెండో రోడ్డు వైపునకు పడిపోవడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకుందామని అతడే దూకాడా...లేక ఉన్నపలంగా కింద పడిపోయాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. 3వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలను ఆరా తీస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు త్రీటౌన్ సీఐ 9490618679, ఎస్ఐలు: 934691715, 9963346769 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆసుపత్రిలో భాగం కోసమే దాడి

● అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి సహా ఏడుగురి అరెస్ట్

● టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ వెల్లడి



అరెస్టు చేసిన వారిని చూపుతున్న టూ టౌన్ సీఐ

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): షేర్ కోసమే శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో దాడులు చేశారని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. రెంటల్ పార్ట్‌నర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి దురుద్దేశ పూర్వకంగానే ఆసుపత్రిపై దాడి చేశారని ఆయన స్పష్టం చేశారు. దాడికి దిగిన దుండగులను సోమవారం టూ టౌన్ సీఐ అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి సత్యనారాయణరెడ్డితోపాటు మరో ఆరుగురిని అరెస్టు చూపించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. 2020లో పాత పావనీ ఆసుపత్రిని గుత్తా పావని నుంచి శ్రీనివాసరావు, మొగలి సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, శ్రీలత కొనుగోలు చేశారు. శ్రీనిలయం పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుని, అనంతరం శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు 10 ఏళ్ల లీజ్‌కు ఇచ్చారు. శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఓనర్లుగా శ్రీనివాసరావు, రాఘవేంద్ర ఆసుపత్రిని ఆధునికీకరించుకుంటున్నారు. కేవలం రెంటల్ పార్ట్‌నర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి ఆసుపత్రిలో షేర్ కావాలని అడిగాడు. వాళ్లు అందుకు అంగీకరించకపోవడంతో తన అనుచరులతో మారణాయుధాలతో ఆసుపత్రిపై దాడికి దిగాడు. దుండగులపై కేసు నమోదుచేశారు. నిందితులను ప్రసన్నాయపల్లి గేటు వద్ద అరెస్టు చేశారు. జనశక్తినగర్‌కు చెందిన అడ్వొకేట్ మొగలి సత్యనారాయణరెడ్డి(45), ఎల్‌బీ కాలనీకి చెందిన సాయినాథ్‌రెడ్డి(46), దానంపల్లి బీసీ కాలనీకి చెందిన బోయ సీతారాములు(23), దానంపల్లికి చెందిన యువరాజ్(20), కళ్యాణదుర్గం మండలం నారాయణపురానికి చెందిన చంద్రశేఖర్(21), ఆజాద్‌నగర్‌కు చెందిన షాషావలి(26), విడపనకల్లుకు చెందిన నవీన్(25)ను అరెస్టు చేశారు. వారి నుంచి 3 కార్లు, మోటర్ సైకిల్, మూడు సుత్తులు, రెండు మచ్చుకత్తులు, రెండు చెట్ల అద్దాలు, రెండు కట్టెలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టి.. న్యాయాధికారి ఆదేశాలతో రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

టమోటా కిలో రూ.51

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.51తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.30తో, సరసరిగా రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19,200తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు చెప్పారు.

సత్యసాయి వేడుకలు సక్సెస్

భక్తుల్లో హర్షాతిరేకాలు



వేడుకలలో చివరి రోజు రాత్రి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయికి మహా మంగళహారతి

పుట్టపర్తి/టౌన్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు విజయవంతంగా ముగియడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ట్రస్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ వల్లే వేడుకలు ఘనంగా జరిగినట్లు భక్తులు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులు ముందుగానే మంత్రులతో కమిటీ ని ఏర్పాటు చేసింది. పట్టణంలో అవసరమైన సౌకర్యాల కల్పన, సుందరీకరణకు రూ.20కోట్లు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముందస్తు ఏర్పాట్లపై తరచూ సమావేశాలు సమీక్షలు నిర్వహించారు. ఈనేపథ్యంలో ఉత్సవాల ప్రారంభం నుంచి రాష్ట్రం, దేశవిదేశాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈక్రమంలోనే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు పుట్టపర్తికి తరలివచ్చి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ముగిసిన నారాయణ సేవ

సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న లక్షల మంది భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 13 నుంచి 12రోజులు నిరంతరాయంగా నారాయణ సేవ కొనసాగించారు. ఆఖరిరోజు సోమవారం రాత్రి భక్తులకు నారాయణ సేవ అందించి ముగించారు. నారాయణ సేవను దాదాపు 5 వేల మంది అందించారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పాడేరు, శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఎక్కువ మంది సేవాదళ్‌లో పాల్గొన్నారు. వీరుగాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు చాలా మంది భక్తులకు తమ వంతు సాయం చేశారు. ప్రశాంతి నిలయం విద్యాసంస్థలు లేజర్‌షో, డ్రోన్లతో ఫొటోలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

జిల్లా యంత్రాంగం సమష్టి కృషి వల్లే..

జిల్లా యంత్రాంగం సమష్టి కృషి ఫలితంగానే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం రాత్రి స్థానిక సాయిఆరామంలో జిల్లా అధికారులతో కలెక్టర్, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త అధ్యక్షతన సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా సౌకర్యాలు, స్వచ్ఛత, వైద్యసేవలు తదితర విభాగాలలో అధికారుల పనితీరును ప్రశంసించారు. శతజయంతి ఉత్సవాలు రాష్ట్ర స్థాయిలోనేగాక జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా ప్రతి శాఖ సమన్వయంతో అద్భుతంగా నిర్వహించిందని కలెక్టర్ అభినందించారు. లక్షలాదిగా పాల్గొన్న భక్తులకు 5వేల మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఒక మంచి కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు అందరూ పాల్గొని ఉల్లాసంగా గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్.శర్మ, మహేష్, ఆనందకుమార్, డీఎఫ్‌ఓ చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఫొటోలో ఎస్పీ, జేసీ



సత్యసాయిని ధ్యానిస్తున్న నటి సాయి పల్లవి.. భక్తుల తన్మయత్వం



పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో శత జయంతి వేడుకలలో భక్తి గీతాలను ఆలపించి అలరించిన భారతీయ, విదేశీ గాయకులు







సత్యసాయికి పాశ్చాత్య భక్తుల సంగీత నివేదన

30లోపు పది పరీక్ష ఫీజు చెల్లించండి

● జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్

కొత్తచెరువు/అనంతపురం విద్య, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈనెల 30వరకు పబ్లిక్ పరీక్షా ఫీజును చెల్లించవచ్చని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా ఫీజు చెల్లించే సమయంలో విద్యార్థి వివరాలు, మీడియం తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అపార్ ఐడీ పూర్తికానీ విద్యార్థులు ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్ ద్వారా తల్లిదండ్రుల అనుమతి పత్రంతో వివరాలను ఆన్‌లైన్‌లో సరిచేసుకోవాలన్నారు. ఒకేషనల్ ట్రేడ్ ఉన్న పాఠశాలల్లో టీచర్లు లేకపోతే ఆ విద్యార్థులు డీఈఓ దృష్టికి సమాచారం తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వ పరీక్షా విభాగం అధికారులకు తెలియజేస్తామన్నారు. దీంతో ఒకేషనల్ ట్రేడును తొలగించి జనరల్‌గా పరీక్షలు రాయడానికి అవకాశం కల్పిస్తారన్నారు. వివరాల కోసం 7032861795, 9491100431 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ పరీక్షల ఫీజు చెల్లింపులో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇప్పటికే ఈపరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. అన్ని యాజమాన్యాల ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుడైస్ పోర్టల్‌లో విద్యార్థి వివరాలు ధ్రువీకరించడానికి వెబ్‌సైట్‌లోని పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏసీ వెంకటేష్, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, ఏఎస్ఓ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ నాగరాజులతో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 970222436, 8886555174,9440839419,9182115437 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం ఏకగ్రీవం..!

ఆరు పదవులకు.. ఆరు నామినేషన్లు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి ఈశ్వర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం పాలక వర్గం ఎన్నిక ఏకగ్రీవమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో చోటు చేసుకున్న అవకతవకల నేపథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా క్రికెట్ సంఘం అండతో క్రీడాకారుల ఎంపికలో అక్రమాలకు సహకరించినట్లు పెద్ద చర్చ సాగింది. ఈ క్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇదివరకు పనిచేసిన పాలకవర్గ సభ్యులు తప్పుకుని... కొత్త వాళ్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. గతంలో జిల్లా క్రికెట్ సంఘంలో పనిచేసిన వ్యక్తులు తిరిగి తమకు పదవులు కావాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఇందులో జిల్లాలో నివాసం లేని వ్యక్తులు పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధ్యక్ష పదవి కోసం హైదరాబాద్‌లో ఉండే వ్యక్తి తరఫున సోమవారం నామినేషన్ వేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్‌గా ఉన్న వ్యక్తి కార్యదర్శి పదవికి నామినేషన్ వేయగా.. స్థానికేతరుడుగా ఉన్న వ్యక్తి ఉపాధ్యక్ష పదవికి, గతంలో సంఘంలో పనిచేసి క్రికెట్‌తో సంబంధం లేని, సెలెక్షన్స్ అవకతవకల్లో పేరు ఉన్న వ్యక్తి కోశాధికారి పదవికి, సహాయ కార్యదర్శి పదవికి క్రికెట్ ప్లేయర్, కౌన్సిలర్‌కు క్రికెట్‌కు సేవ చేయని వ్యక్తి నామినేషన్లు వేశారు. ఆరు పదవులకు ఆరుగురే నామినేషన్లు వేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల అధికారి, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్ పర్యవేక్షణలో జిల్లా క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం నామినేషన్లు వేసిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.. అధ్యక్షుడు-సి శ్రీనాథ్, కార్యదర్శి- ఎ.యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు- నూర్ మహ్మద్‌ఖాన్, సహాయ కార్యదర్శి- ఎన్. సర్దార్, కోశాధికారి- జె.మురళీకృష్ణ, కౌన్సిలర్- హెచ్.అన్సార్‌ఖాన్ ఉన్నారు. ఆరు పదవులకు ఆరుగురే నామినేషన్లు వేయడంతో ఈనెల 29వతేదీ సర్వసభ్య సమావేశం, ఏకగ్రీవ ప్రకటన లాంఛనమేనని తెలుస్తోంది. 2025-28 సంవత్సరానికి నూతన కార్యవర్గం పదవీ కాలం కొనసాగనుంది.

బాల బాలికల క్రికెట్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-17 బాల, బాలికల క్రికెట్ జట్లను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లా బాల, బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ బాలుర సెక్రటరీలు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బాలికల సెక్రటరీలు శకుంతల, సుహాసిని ప్రకటించారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు సునీల్, శరణ్, వేణు, గౌసియా, ఆనంద్, వెంకటేశులు, యమున, శ్యామల, చామంతి, లీలారాణి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

● బాలికల జట్టుకు పూర్ణచంద్రిక, తరుణిక, చక్రిక, హిమవర్షిణి, లక్ష్మోహన్, ఛాయశ్రీ, అక్షర, బృంద, సంజన, జస్మిక, మహ్మదీ, శ్రావణి, గోపి చందన, కాత్యాయని, శృతి కీర్తన, సమత ఎంపికయ్యారు.

● బాలుర జట్టుకు జయప్రకాష్, రంజిత్‌కుమార్, పునీతేశ్వర్, గోవర్ధన్, కౌశిక్, సీతారామ్, తన్మయికృష్ణ, వర్ల జయదీప్, వెంకటసాయి, వెంకటసాయి, సంతోష్, కార్తీక్, మహ్మద్ సాబీర్, తరుణ్ కుమార్ రెడ్డి, మనోజ్, లఖిత్, మహేంద్ర ఎంపికయ్యారు.

స్పిన్ ఉచ్చులో ఒడిశా

● 126 పరుగులకే కుప్పకూలిన వైనం

● కూచ్ బెహార్ అండర్-19 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర పట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర బౌలర్లు లోహిత్, కార్తీక్‌రెడ్డి స్పిన్ మాయాజాలానికి ఒడిశా జట్టు 126 పరుగులకే కుప్పకూలింది. చెరో నాలుగు వికెట్లతో చెలరేగడంతో స్వల్ప స్కోరుకే చాప చుట్టేసింది. కూచ్ బెహార్ అండర్-19 క్రికెట్ టోర్నీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్ర-ఒడిశా జట్ల మధ్య మ్యాచ్ రెండోరోజు సోమవారం కొనసాగింది. ఆంధ్ర జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 246-7తో రెండో రోజు ఆట ఆరంభించింది. కేవలం 36పరుగులు జోడించి మిగిలిన 3వికెట్లు కోల్పోయింది. ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 94.4ఓవర్లలో 282 పరుగులు సాధించింది. ఇందులో ఏఎస్‌వీ లోహిత్ 71పరుగులు సాధించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఒడిశా 63.1ఓవర్లలో 124పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు సుభాసిస్ మల్లిక్ 40, ప్రశాంత్ మోక్షిత్ 35పరుగులు చేశారు. ఆంధ్ర బౌలర్లు ఏఎస్‌వీ లోహిత్, కార్తికొరెడ్డి తమ స్పిన్ మాయాజాలంతో ఒడిశా నడ్డివిరిచారు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రజట్టు రెండోరోజు ఆటముగిసే సమయానికి 15ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 46పరుగులు సాధించింది. బీసీసీఐ రెఫరీ వరుణ్‌కుమార్, అంపైర్లు జై సంఘని, సబిసాచి సర్కార్‌లు మ్యాచ్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, కమలాకర్ నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.



ఒడిశా బ్యాటర్లకు చుక్కలు చూపిన ఆంధ్ర బౌలర్లు లోహిత్, కార్తీక్‌రెడ్డి



ఒడిశా వికెట్ తీసిన ఆనందంలో ఆంధ్ర ఆటగాళ్లు

అందుబాటులోకి 20 రకాల ప్రభుత్వ సేవలు

● డిజి లక్ష్మీ సేవాకేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే



డిజి లక్ష్మీ సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిజి లక్ష్మీ సేవా కేంద్రంలో 20రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి వారు డిజి లక్ష్మీ సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజీ లక్ష్మీపథకం కింద పట్టణ పేద మహిళలు నడిపే 10వేల కియోస్కుల ద్వారా సుమారు 20రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాలు పొందవచ్చని తెలిపారు. దీంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తక్కువ ఖర్చుతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతాయని పేర్కొన్నారు. డిజి లక్ష్మీసేవాకేంద్రాల సంఖ్య పెంచుతామని, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ, మెప్మా అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ సతీష్ కేసును సీబీఐకి అప్పగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కుమ్మర శాలివాహన సంఘం నాయకులు

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే సీఐ సతీష్ కుమార్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని కుమ్మర శాలివాహన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎస్పీకి వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఐ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. పదిరోజులు గడిచినా ఇది హత్య..? ఆత్మహత్య..? అన్న విషయం తేలలేదన్నారు. హత్య అయితే నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. టీటీడీ పరకామణి కేసులోని నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ కుటుంబానికి పరిహారం అందించాలన్నారు. పిల్లల చదువుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, ఓబులపతి, గోపాల్ మలరాయుడు, రామ్మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత



డయాస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పూర్వ విద్యార్థి సతీష్

ఓబుళదేవరచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో తన వంతుగా సొంత నిధులు రూ. 70వేలతో పూర్వ విద్యార్థి, జనసేన మండల కార్యదర్శి కొండబోయన సతీష్ డయాస్ నిర్మాణ పనులను చేపట్టారు. అందులో భాగంగా సోమవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణనాయక్‌తో కలిసి పనులను పరిశీలించారు. చదువుకున్న పాఠశాలలో జ్ఞాపకార్థంగా డయాస్ నిర్మాణం చేపట్టిన పూర్వ విద్యార్థి సతీష్‌ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

కొత్తచెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు మంగళవారం నుంచి ఈ నెల 28 తేదీ వరకు ఎల్ఎస్‌డీసీలో భాగంగా థీమ్-5పై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నటరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ శిక్షణ తరగతుల్లో గ్రామ పంచాయతీల్లో ఉన్న వనరులను ఉపయోగించుకొని గ్రామాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పచ్చదన పెంపు తదితర అంశాలపై వివరిస్తారని ఆయన తెలిపారు. మంగళవారం సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, బుధవారం గ్రీన్ అంబాసి డర్లు, గ్రీన్ గార్డులకు, ఈ నెల 28వ తేదీ, ఎస్‌హెచ్‌జీ వివోలు, సభ్యులకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30వరకు ఈ తరగతులు ఉంటాయన్నారు. కావున మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్‌లో ఉన్న బ్రిలియంట్ స్కూల్‌లో ఈనెల 26న బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ సీవీశేషు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి సమస్యలు, దంత సమస్యలు, చిన్నపిల్లల సమస్యలకు డాక్టర్ విక్రాంత్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ మనోజ్ వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైకు

● ఇద్దరికి గాయాలు

నల్లచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాట్నాలపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పత్రవాండ్లపల్లికి చెందిన జగదీష్ అనే యువకుడు పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం తన ద్విచక్రవాహనంలో తన స్నేహితుడు రమేష్‌తో కలిసి కదిరికి బయల్దేరాడు. అయితే రాట్నాలపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని గమనించక పోవడంతో ఒక్కసారిగా లారీ వెనుక భాగాన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో జగదీష్‌తలకు తీవ్ర గాయం కాగా, రమేష్ రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు రమేష్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు సమాచారం.

స్టడీ మెటీరియల్ పంపిణీకి సాయం



యూటీఎఫ్ నాయకులకు చెక్కు అందజేస్తున్న నిసార్ యాసీన్ ఖాన్

కదిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజక పరిధిలోని పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 1000 విద్యార్థులకు మాదిరి ప్రశ్న పత్రాల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు స్థానిక సిమ్స్ హాస్పిటల్ అధినేత నిసార్ యాసీన్ ఖాన్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు బి. మైనుద్దీన్ రూ.80 వేలను అందజేశారు. ఈ సొమ్మును వారు సోమవారం సిమ్స్ హాస్పిటల్ వద్ద యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి తాహేర్‌వలికి అందజేశారు. ఈ సందర్భంగా నిసార్ యాసీన్ ఖాన్ మాట్లా డుతూ... తన తల్లిదండ్రులు ఉపాధ్యాయులని, వారు పేదల విద్యార్థుల అభివృద్ధి కోసం పడిన తపనను కళ్లారా చూశానని తెలిపారు. అందుకే తాను కూడా పేద విద్యార్థుల కోసం తన వంతుగా సహాయ సహకరాలు అందిస్తున్నానన్నారు. భవిష్యత్తులోనూ విద్య, వైద్యం పరంగా సాధ్యమైనంత మేరకు సేవలందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆజం బాషా, మల్లికార్జున, సంతోష్‌కుమార్, మధుసూదన్, రాజేష్, వెంగమనాయుడు, ఖాజా మొహియుద్దీన్, రవివర్ధన్‌రెడ్డి, నజీర్, సుధాకర్, మహబూబ్ బాషా, బాబాజాన్, హరిప్రసాద్, భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఆర్డీఓకు చౌక డిపో డీలర్ల వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న చౌకడిపో డీలర్లు

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌక డిపో డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ధర్మవరం పట్టణ రేషన్ డీలర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ సురేశ్‌బాబుకు అధికారుల కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్ఎఫ్ఎస్ఏ కమీషన్ ఇవ్వాలని, క్రెడిట్ ఆర్ఓ ద్వారా పంచదార, ఇతర సరుకులు డీలర్లకు ఇవ్వాలని ఆర్డీఓ, తహసీల్దార్‌లను డీలర్లు కోరారు. స్పందించిన ఆర్డీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ... పై అధికారులకు డీలర్ల సమస్యలను తెలియజేసి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



కొత్తచెరువు: మండలంలోని కొడపగానిపల్లిలో కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ సతీశ్‌బాబు తదితరులు



ధర్మవరంరూరల్: మండలంలోని గొట్లూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న హార్టికల్చర్ మండల అధికారి అమరేశ్వరి, గ్రామాధికారి జ్యోత్స్న, కూటమి నాయకులు అనిల్ గౌడ్, రైతులు, మహిళలు



అమడగూరు: పాల్గొన్న ఏఓ వెంకట రమణాచారి, రైతు సేవాకేంద్రం సిబ్బంది, అనుబంధ రంగాల సిబ్బంది, నాయకులు, రైతులు

రైతుల వద్దకే ప్రభుత్వం

● ఇళ్ల వద్దకు వెళ్లి 'రైతన్నా..మీ కోసం'పై వివరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్ వర్క్)

రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంచసూత్రాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. ధర్మవరం రూరల్, కదిరి, కొత్తచెరువు, అమడగూరు, గాండ్లపెంట, నంబులపూలకుంట, ఓబుళదేవర చెరువు, నల్లమాడ మండలాల్లో వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు సోమవారం 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇల్లు తిరుగుతూ రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం రైతుల కోసం చేపట్టే ఐదు విధానాలకు సంబంధించి ముఖ్యమంత్రి సందేశం ఉన్న కరపత్రాలను అందజేసి, వివరించారు. దీంతో పాటు ప్రభుత్వం విడుదల చేసిన ఆపామిస్ (ఏపీఏఐయంఎస్) యాప్‌ను రైతుల స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించి యాప్ ఉపయోగాలు వివరించారు. కదిరి మండలం కొండమనాయునిపాళ్యం గ్రామంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.



నల్లమాడ: తహసీల్దార్ మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ అబ్దుల్‌హక్, సింగల్‌విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, ఉంద్ర శివారెడ్డి, ఏపీ కేశవరెడ్డి, పూల రామయ్య



ఓబుళ దేవర చెరువు: మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్లు సురేష్, ప్రవీణ, గోపీనాథ్‌రెడ్డి, షేక్ నిజాం వలి, పిట్టా రాజారెడ్డి, మండోజీ ఆరీఫ్‌ఖాన్, చికెన్ షాను, వీవీ ఆదినారాయణ, వీఆర్ఓ శ్రీలత తదితరులు



గాండ్లపెంట: ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ బాబు రావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ షాదాబ్, కూటమి నాయకులు వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, అక్రమ్ బాషా, బాబాసాబ్, సికిందర్, సూర్యనారాయణరెడ్డి, పవన్, మునాఫ్, నరసింహులు తదితరులు



నంబులపూటకుంట: ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ దండే రవిశంకర్, గంగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, మగ్గం రామాంజి, నర్సప్పనాయుడు, చిన్నరెడ్డి, మౌలా, గంగులప్ప, రామిరెడ్డి, శ్రీనివాసులు, శివయ్య తదతరులు

సత్యసాయి సేవలు మరువలేనివి

● చిలకం మధుసూదన్‌రెడ్డి



మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న చిలకం మధు, సంధా రాఘవ

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా సేవలు మరువలేనివని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని యాదవవీధిలో సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు రాజు ఆధ్వర్యంలో చీరల పంపిణీ, రక్తదాన శిబిరాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్ర మాలకు ముఖ్యఅతిథులుగా జనసేనపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, చేనేతప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సత్యసాయి శివైక్యం పొందినా 15సంవత్సరాలుగా ఆయన చేపట్టిన సేవలను భక్తులు పారదర్శకంగా కొనసాగించడం విశేషమన్నారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అన్నదానం చేపట్టారు. అలాగే యాదవవీధిలో నూతనంగా నిర్మిస్తున్న వినాయక ఆలయానికి రూ.లక్ష, ఓడీసీ మండలంలో నిర్మిస్తున్న శివాలయానికి రూ.50వేలు చిలకం మధుసూదన్‌రెడ్డి చేతులమీదుగా విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, రాజారెడ్డి, అడ్డగిరి శ్యాంకుమార్, సరితాల బాషా, టీడీపీ నాయకులు కొత్తపేట ఆది, కేశగాళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వం ఉంటే ఏదైనా సాధ్యం

● బీజేపీ ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి

ఓబుళదేవరచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రభుత్వం అధికారంలో ఉంటే చేపట్టే ఏ కార్యక్రమమైనా దిగ్విజయంగా పూర్తి అవుతుందనడానికి నిదర్శనమే సత్యసాయి శతజయంతి ఉత్సవాలు అని బీజేపీ ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు శ్రీనివాసునాయక్ పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసిన ఘనత ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి రత్నాకర్‌దే అన్నారు. వారు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్యసాయి శత జయంతిని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అసెంబ్లీలో కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్ల నిధులు విడుదల చేసి, సత్యసాయి శతజయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిం చాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి దగ్గరుండి పనులు పర్యవేక్షించి భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూశారన్నారు. ప్రభుత్వ పెద్దలతో పాటు సేవాదళ్ సభ్యులు అంకితభావంతో పనిచేశారన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ కంచి సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజినేయులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజి, కొత్తా సుధాకర్‌రెడ్డి, సరేంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలి'

ఓబుళదేవరచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ మండల కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా భవన కార్మికులతో పాటు అర్హులైన నిరుపేదలకు ఇంటి నివాస పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో రిలే దీక్షలు చేయగా... ఇంటి పట్టాలు ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారే కానీ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన వారికి ఇంటి పట్టాలు, పక్కా గృహాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

● సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమన, నియోజకవర్గ కార్యదర్శి పోలా లక్ష్మీనారాయణలు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సోమవారం కళాకారుల బృందాలు, శ్రమ జీవుల సమస్యలు, రైతుల సంక్షోభం, మహిళల భద్రత, నిరుద్యోగ యువ త ఆందోళనలు తదితర అంశాలపై పాటల రూపంలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డిసెంబరు 6,7 తేదీల్లో కడపలో రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇవి కేవలం పార్టీ సమావేశాలు కాదని, ప్రజా సమస్యలకు దిశా నిర్దేశం చేసే చారిత్రక సందర్భమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజామండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, చంద్రన్న, నాయకులు వెంకటేశ్, లక్ష్మీ, పార్టీ నాయకులు శివప్రసాద్, శివకుమార్, భీమేష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

● యూనియన్ బ్యాంక్ మేనేజర్, మరో ఇద్దరికి గాయాలు

తనకల్లు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొక్కంటి క్రాస్ సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని కొక్కంటిక్రాస్‌లోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో కదిరికి వెళ్తున్నారు. నల్లచెరువు మండలంలో పెద్ద యల్లంపల్లికి చెందిన లక్ష్మీనారాయణ, అన్నమయ్యజిల్లా రంగసముద్రానికి చెందిన లోకేష్ ద్విచక్రవాహనంలో అన్నమయ్య జిల్లా మొలకలచెరువు వైపు నుంచి కదిరి వైపు వెళ్తూ... ముందు వెళ్తున్న బ్యాంక్ మేనేజర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, లోకేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని కొక్కంటి క్రాస్‌కు చెందిన వందేమాతరం టీమ్ సభ్యులు, వారి అంబులెన్సులో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాలధారుల సేవలో ఆలయ కమిటీ

● దాతల సహకారంతో ఇరవై ఏళ్లుగా కొనసాగుతున్న భిక్ష



మధ్యాహ్నం భిక్షకు హాజరైన అయ్యప్ప మాలధారులు

ముదిగుబ్బ, నవంబరు, 24(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే అయ్యప్ప మాలధారణ అన్నిచోట్ల ప్రారంభమైంది. అయ్యప్ప మాలధారులు దీక్షలో ఉన్న రోజుల్లో నిత్యాన్నదానం అందించి ఆదర్శంగా నిలుస్తోంది ముదిగుబ్బ శ్రీపంచగిరీశ అయ్యప్పస్వామి ఆలయ కమిటీ. గత 20 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది. నిత్యం అయ్యప్ప, శివ మాలధారులు సగటున 500 మందికి 62 రోజుల పాటు మధ్యాహ్నం భిక్ష అందిస్తున్నారు. ఇక్కడ భిక్ష అందించే కార్యక్రమం దాదాపు పది రోజుల క్రితం ప్రారంభమైంది

ఆలయ ప్రాంగణంలోనే అన్ని సౌకర్యాలు

మండల కేంద్రంలోని పులివెందుల రోడ్డులో సువిశాల ప్రాంతంలో 19 ఏళ్ల క్రితం అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి అంచలంచెలుగా అభివృద్ధి చెందింది. పులివెందుల నుంచి బెంగుళూరుకు ముదిగుబ్బ మీదుగా అరటికాయల బొలేరోలు, సిమెంటు లారీలు, ఇతర వాహనాలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. వాటిలో ప్రయాణించే మాలధారులు భిక్ష కోసం వెతుక్కునే అవసరం లేకుండా ఇక్కడ వాహనాలు ఆపి హాజరవుతుంటారు. ఇంటి దగ్గర వసతి లేని అయ్యప్ప, శివ, భవానీ మాలధారులు గుడి ఆవరణలోనే స్నానాది కార్యక్రమాలు ముగించుకుంటారు. అయ్యప్పల సీజన్లో ఇక్కడ నిత్యాన్నదాన కార్యక్ర మం ప్రాచుర్యం పొందడంతో చాలామంది పిల్లల జన్మదిన వేడుకలు, పెళ్లిరోజు వేడుకలను పురస్కరించుకొని భిక్ష కోసం విరాళాలు అం దిస్తున్నారు. మరికొందరు ఒకరోజు ఖర్చుగా భరిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కొన్ని మండలాలకు చెందిన భక్తులు దాదాపు 25 మంది దాకా శాశ్వత అన్నదాతలుగా ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలుపుతున్నారు.

మంచి స్పందన వస్తోంది



మాలధారులకు భిక్ష అందించే అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ముదిగుబ్బ మీదుగా ప్రయాణాలు సాగించే అయ్యప్ప దీక్ష ధారులు మధ్యాహ్నం వేళ ఇక్కడకు భిక్షకు హాజరవుతున్నారు. దాతల సహకారంతో అన్ని సేవలు అందుతున్నాయి. మాలధారణ నుంచి ఇరుముడి వరకు నిత్యం భక్తులకు ఇక్కడే పూజలు, భజనలు చేయిస్తాం. స్నానాలు చేసుకోవడానికి, రాత్రిపూట పడుకోవడానికి వసతి కల్పిస్తున్నాం. పరస్పర సహకారంతో అందరిని భాగస్వాములను చేసేందుకు సూచిస్తున్నాం

- సోమగుట్ట సింగారెడ్డి
శ్రీపంచగిరీశ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ధర్మకర్త

ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష వద్దు

● హెల్త్ విభాగం జాయింట్ కమిషనర్ రమేశ్‌నాథ్



వారోత్సవాలను ప్రారంభిస్తున్న జాయింట్ కమిషనర్

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, టీబీ బాధితుల పట్ల వివక్ష చూపరాదని సెకండరీ హెల్త్ విభాగం జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేశ్‌నాథ్ పేర్కొన్నారు. ఎయిడ్స్, టీబీపై సోమవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, శక్తి మైత్రి మహిళా సంఘం, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేశ్‌నాథ్ హాజరై స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో ఎయిడ్స్‌పై ఐఈసీ వారోత్సవాలను, స్టాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఎయిడ్స్ వ్యాప్తి, నియంత్రణ తీసుకోవాల్సి జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, ఐసీటీసీ వైద్యాధికారి డాక్టర్ నజీర్, కౌన్సిలర్ వనమాల, ల్యాబ్ టెక్నీషియన్ భార్గవి, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్, ఔట్ రీచ్ వర్కర్లు వంశీలక్ష్మి సరస్వతి, కవిత, త్రివేణి పాల్గొన్నారు. అదేవిధంగా ఆయన సోమవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాల వార్డులను పరిశీలించారు. హాజరు పట్టిక, వివిధ విభాగాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



ఎస్ఎస్ఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

బుక్కపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యోగులు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఎస్ఎస్ఏ కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిా స్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ.... గత 20 సంవత్సరాల పని చేస్తున్న తమకు జీతాలు పెంచడం లేదని, తమ డిమాండ్లను నెరవేర్చలేదని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి వేతనం కల్పించాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం జూన్ 2014 ముందు పనిచేసే వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మం జూరు చేసి హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. రిటైర్మెంట్ గ్రాట్యుటీ రూ.10 లక్షలు ఇ వ్వాలనే తమ పలు డిమాండ్ల నెరవేర్చాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్ర మంలో ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిాస్ యూనియన్ల జేఏసీ ప్రధాన కార్యద ర్శి రామన్న, నాయకులు భాస్కర్, హారున్ బాషా, గోవింద రెడ్డి, కిష్టప్ప, ముకుంద, నాగరాజు, వరలక్ష్మి, భాగ్యమ్మ, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు





ఎంపికైన క్రీడాకారులు నవ్య, పవన్

ధర్మవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు కోచ్ పృథ్వీ తెలిపారు. పల్నాడుజిల్లాలో వినుగొండలో ఈ నెల 15 నుంచి 17వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ధర్మవరానికి చెందిన నవ్య, పవన్ ప్రతిభ కనబరచారని ఆయన తెలిపారు. బాలికల విభాగంలో నవ్య హిమాచల్ ప్రదేశ్‌లోని పంట సహిద్ నగరంలో డిసెంబరు 22 నుంచి 26వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొంటుంద న్నారు. అదేవిధంగా బాలుర విభాగంలో పవన్ హర్యానా రాష్ట్రం పానిప ట్నా నగరంలో డిసెంబరు 15 నుం చి 19వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, ఆర్డీ హనుమంతప్ప, కోచ్‌లు రాజశేఖర్, అనిల్, పృథ్వీ సోమవారం అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● 'రైతన్నా.. మీకోసం' ప్రారంభం

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పలువురు నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. వచ్చే నెల రెండో తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. నియోజకవర్గ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లోని రైతుల ఇళ్లవద్దకు వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు వెళ్లి సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పంచసూత్రాలను వివరించారు. సీఎం ఇచ్చిన లేఖను రైతులకు అందించారు. ఏఏ పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలి, ఏ పంటను సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయో రైతులకు వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటూనే వాటికి పరిష్కారాలు చూపేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


హిందూపురంలో 'రైతన్నా.. మీకోసం' లో పాల్గొన్న మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వత్థ నారాయణరెడ్డి, ఏఓ సురేంద్ర నాయక్, శంకర్, రైతులు


సోమందేపల్లిలో సీఎం లేఖలను అందిస్తున్న నాయకులు వెంకటరమణ, వెంకటేశులు, భానుకీర్తిస్వామి, సిద్దలింగప్ప, కిష్టప్ప, సూరి, హరికృష్ణ, విజయభారతి


అగళిలో రైతులకు కరపత్రాలు అందజేస్తున్న జడ్పీటీసీ ఉమేష్, కుమారస్వామి


పెనుకొండ పంచాయతీ ఇస్లాంపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చందన, నాయకులు శ్రీరాములు, హనుమంతు, రమణమ్మ


చిలమత్తూరులో కరపత్రాలు అందిస్తున్న వ్యవసాయాధికారి కవితారాణి, పశువైద్యాధికారి గాయత్రి

న్యూస్ బాక్స్

ఘనంగా జలధి ఉత్సవం


కర్రెమ్మ దేవికి జలధి ఉత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

గుడిబండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ గ్రామంలో వెలిసిన కరియమ్మదేవి ఆలయంలో అమ్మవారి జలధి ఉత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ సమీపంలోకి తీసుకెళ్లి జలధి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు సుబ్రహ్మణ్య షష్ఠి



పెనుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసరవక్కరి బావి వద్దన వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం, బుధవారం రెండ్రోజుల పాటు స్వామివారి షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు శేషప్పస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి ప్రాతఃకాల పూజ, మహా మంగళహారతి, సాయంత్రం గంగపూజ, కలశస్థాపన, నవగ్రహపూజ, సామూహిక కుంకుమార్చన ఉంటుందన్నారు. బుధవారం 7 నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, నవగ్రహ సుబ్రహ్మణ్యస్వామి, రుద్రాస్వాహాకార హోమం, రతాంగహోమం, పూర్ణాహుతి, మంగళహారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 11-45కు సుబ్రహ్మణ్యస్వామి 25వ రతోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి


పటేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

పెనుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారతదేశ మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని లిటిల్ ఏంజిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు జాఫర్ వలి అన్నారు. సోమవారం స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో సొసైటీ ఆధ్వర్యంలో పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, రిటైర్డ్ అధ్యాపకుడు భాస్కర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షామీర్ బాషా, ఏట కేశవయ్య, ఎంఎన్ మూర్తి, సతీష్ సొసైటీ సభ్యులు కలిసి పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

బస్టాండును వినియోగంలోకి తీసుకురండి


డీటీ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం నాయకుడు పెద్దన్న డిమాండ్ చేశారు. అలాగే దివ్యాంగుల పింఛన్ల దరఖాస్తుకు ప్రభుత్వం 10 రోజులు గడువిచ్చినా నేటికీ సచివాలయాల్లో వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కొండా వెంకటేశులు, ఈడిగ నాగరాజు, బెస్త కిష్టప్ప, రామక్రిష్ణ, జింకా నాగరాజు, సంజీవప్ప, కిష్టప్ప, బాలసంజీవ పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ వితరణ



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఎంఎన్ స్వామి

మడకశిర టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని జూనియర్ కళాశాలకు రూ.1.70 లక్షల విలువ చేసే వెయ్యి లీటర్ల ఆర్‌ఓ ప్లాంట్‌ను సాహితీ గగన్ మహల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం అందించారు. వాటర్‌ప్లాంట్ వల్ల 300 మంది విద్యార్థులకు తాగునీరు అందుబాటులోకి వచ్చినట్లు ప్రిన్సిపాల్ సుజాత అన్నారు. ట్రస్టు అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని మండలాల ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. వాటర్‌ప్లాంట్‌ను ఆర్‌బీఐ మాజీ రీజనల్ డైరెక్టర్ ఎస్ఎంఎన్ స్వామి ప్రారంభించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

రొళ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మిరొట్టి గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఒంగోలు జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన సూపర్‌సెవెన్ క్రికెట్ పోటీల్లో సత్యసాయిజిల్లా జట్టు తరపున ఆడి పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారన్నారు. డిసెంబరు 26న జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు, టోర్నీ ఆర్గనైజర్ గణేష్ ఫోన్‌లో తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ సుమాజగన్నాథ్, చైర్మన్ షైలారప్ప, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.


రన్నర్స్‌గా నిలిచిన జట్టులోని గురుకుల విద్యార్థులు

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్: టీడీపీ

హిందూపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద హిందూపురం కార్యాలయానికి చెందిన పలుశాఖల అధికారులతో ప్రజాదర్బార్ నిర్వహించారు. హిందూపురం మండలంలోని 14 పంచాయతీలకు చెందిన ప్రజలు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వచ్చేనెల ఇదే తేదీన హిందూపురం మండలానికి సంబంధించి ప్రజాదర్బార్ ఉంటుందని అప్పటికి ఈరోజు ఇచ్చిన ఫిర్యాదులు అన్నీ పరిష్కరించాలన్నారు. మొత్తంగా 72ఫిర్యాదులు అందాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 34 ఫిర్యాదులు అందాయి. ప్రతివారం ఒక్కో మండలంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. అధికారులు కూడా వచ్చిన ఫిర్యాదులను సమయం తీసుకుని పరిష్కరించాలన్నారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, కన్వీనర్ రాము, తహసీల్దార్ వెంకటేశులు, సీఐ ఆంజనేయులు, ఇరిగేషన్ డీఈ శైలేశ్వర్‌రెడ్డి, ట్రాన్స్‌కో, మెప్మాతోపాటు పలుశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో పాల్గొన్న అధికారులు, నాయకులు

పారిశుధ్య పనులు మెరుగుపరచాలి


హాజరు పట్టికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పట్టణంలోని మొదటి డివిజన్‌లో కార్మికుల హాజరుపట్టికను పరిశీలించారు. విధులకు సక్రమంగా రాని కార్మికులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతివార్డులో గ్యాంగ్ వర్క్ నిర్వహించి పనులు చేపట్టాలన్నారు.

కెనరా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం


కోగిరలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రొద్దం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోగిర గ్రామంలో కెనరాబ్యాంక్ నూతన శాఖను ఆ బ్యాంకు అధికారులు ప్రారంభించారు. సోమవరం రొద్దం మండలం కోగిర గ్రామంలో కెనరాబ్యాంక్ కార్యాలయాన్ని తిరుపతి సర్కిల్ ఆఫీస్ జీఎం పాండురంగ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు ముందుంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు రుణాలు తీసుకుని సకాలంలో తిరిగి చెల్లిస్తే బ్యాంక్ అభివృద్ధితోపాటు మరికొంతమందికి రుణాలు అందించేందుకు దోహదపడతాయన్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరాబ్యాంక్ రూ.35వేలు విలువచేసే వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతపురం రీజనల్ ఆఫీస్ ఏజీఎం శ్రీనివాసులు, మేనేజర్ నాగరాజు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ బిల్లుల పంపిణీ

అగళి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధిహామీ పథకం కింద 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.1.4లక్షలు బిల్లుల చెక్‌లను తొమ్మిది మందికి పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో నిర్మించుకున్న గోకులం షెడ్లు, సెరికల్చర్ షెడ్డు, సంపద తయారీ కేంద్రాల పనులకు సంబంధించి బిల్లులు రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో బిల్లులు పట్టించుకోలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగస్టు 2025లో బకాయి బిల్లులను మంజూరుచేసింది. జడ్పీటీసీ ఉమేష్, ఎంపీడీఓ గంగాధర్, కన్వీనర్ తిప్పేస్వామి, ఏపీఓ మంజునాథ్ చేతులమీదుగా చెక్కులు పంపిణీ చేశారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు


మాలధారులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

పెనుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో న్యాయవాది సుదర్శన్‌రెడ్డి మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. సోమవారం అయ్యప్పస్వామి ఆలయంలో దాతతో పాటు గురుస్వామి మోహన్ ఆధ్వర్యంలో మాలధారులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమాన్ని 15 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికపై సర్వే


సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రొద్దం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం హౌసింగ్ లబ్ధిదారుల ఎంపికపై సర్వే నిర్వహిస్తోంది. సోమవారం ఆర్.మరువపల్లిలో నిరుపేదలను ఎంపిక చేసేందుకు సచివాలయ ఉద్యోగులు సర్వేచేపట్టారు. బీసీ కాలనీ, దళితవాడలో స్థలం ఉండి ఇల్లులేనివారి జాబితా కోసం సర్వేచేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, చెన్నకేశవులు, చంద్రశేఖర్, సిద్దన్న, బూత్ ఇన్‌చార్జి జయరాములు, రుద్రప్రసాద్, నాగ, సుధాకర్ పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: చైర్మన్


రైతులకు ఉలవలు అందజేస్తున్న చైర్మన్ నరసింహరాజు

మడకశిరటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో 80 శాతం సబ్సిడీతో ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకెళ్లాలన్నారు. పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ఏఓ తిమ్మప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి బేగార్లపల్లి రవి పాల్గొన్నారు.

మడకశిర రూరల్ (ఆంధ్రజ్యోతి): రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు అన్నీ రైతు సేవా కేంద్రాల్లో ఉలవలు అందుబాటులో ఉన్నాయన్నారు. 10 కేజీల ప్యాకెట్ రూ.560 అని, 80 శాతం సబ్సిడీ పోను కేవలం రూ.112లకే 10 కేజీల ఉలవల ప్యాకెట్ లభిస్తుందన్నారు. సోమవారం కల్లుమర్రి రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉలవలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందిస్తున్న ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప కోరారు. మద్దనకుంట గ్రామంలో సోమవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉలవలుపంపిణీ చేశారు. మైనార్టీ నాయకుడు షబ్బీర్, ప్రకాశ్, ఏఈఓ అపర్ణ, వెటర్నరీ సహాయకుడు రమేష్, రైతులు దాసప్ప, మూడ్లిగిరియప్ప, నారాయణప్ప పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణదారులపై చర్యలేవీ?

● కాగితాలకే పరిమితమంటున్న స్థానికులు

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెండో అతిపెద్ద చెరువుగా ప్రసిద్ధి చెందిన పరిగి చెరువును కొందరు ఆక్రమించుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రియల్ వ్యాపారులు చెరువును చదును చేసి ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు ఇటుకల బట్టీ పరిశ్రమలు వెలుస్తున్నా అడిగేవారు కరువయ్యారని అంటున్నారు. దీనిపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వెలువడినా సంబంధిత అధికారులు సర్వేలు చేస్తున్నారు తప్ప చర్యలు తీసుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. పరిగికి చెందినవారేకాకుండా బయటి వ్యక్తులుకూడా చెరువును చదును చేసి రెండు, మూడు భవనాలు నిర్మించారు. దీనిపై విద్యుత్, పంచాయతీలవారు విద్యుత్ చార్జీలు, గుత్తలు, డ్రైనేజీలు, నీటి కొళాయిలు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. చెరువు ఎగువప్రాంతంలో కూల్చుకుంటూ పోతే చెరువుకట్ట పూర్తిగా దెబ్బతిని కట్టతెగిపోయే ప్రమాదం ఉందని, నీటిశాతం తగ్గి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు. చెరువు కింద దాదాపు 20గ్రామాలున్నాయని, చెరువు నీటిని నమ్ముకుని రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. అక్రమార్కులు భవనాలు నిర్మిస్తే పెద్దచెరువు రాబోయే కాలంలో కనబడకుండా పోతుందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి భవనాలను కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నారాయణను వివరణ కోరగా చెరువు భాగంలో అక్రమంగా నిర్మించుకున్న ఇంటికి నోటీసులు త్వరలోనే అందజేస్తాం. వారు నోటీసులకు స్పందించకుంటే వాటిని తొలగిస్తామని అన్నారు.


చెరువు ప్రాంతంలో నిర్మించిన ఇల్లు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీ కండువా వేసి వైసీపీ కార్యకర్తలను సాదరంగా ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలం పందిపర్తి పంచాయతీ, మంచేపల్లి గ్రామాల్లోని వైసీపీకి చెందిన 15మంది మంత్రి సవిత సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం స్థానిక పార్టీకార్యాలయంలో మంత్రి వారికి కండువాలువేసి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ మంత్రి చేస్తున్న అభివృద్ధి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు.

నేతన్న నేస్తం అమలు చేయండి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న చేనేత కార్మికులు

పెనుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అమలు చేయాలని ఏపీ చేనేత సంఘం జిల్లా నాయకుడు శీల నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నాయకులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేతలకు ఎన్నో హామీలు ఇచ్చిందన్నారు. అందులో ప్రధానమైనది నేతన్ననేస్తం అన్నారు. దీని ద్వారా ప్రతి కార్మికుడికి ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.25వేలు వారి బ్యాంక్‌ఖాతాకు జమచేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా హామీని నెరవేర్చలేదన్నారు. నేసిన చీరకు గిట్టుబాటు ధరలేక పవర్‌లూమ్స్‌లతో పోటీపడలేక చేనేత వ్యవస్థ అంతరించే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని కోరారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలన్నారు. మండల సమితి సభ్యులు దాసరి సుధాకర్, బెస్త కిష్టప్ప ఈశ్వర్, దేవాంగం వెంకటేశులు, ఈడిగ నాగరాజు, ఉప్పర సంజీవ, రమేష్, శంకరప్ప, పందిపర్తి రామదాసు పాల్గొన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ

పావగడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాలూకా పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, ఈఓ ఉత్తం, తహసీల్దార్ రవి దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మూడు శాతం నిధులతో సేకరించిన నగదు నుంచి జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ తరపున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఈఓ తెలిపారు. అనంతరం కేడీపీ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతి పీడీఓ నియామానుసారం గ్రామసభల ద్వారా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరువుకు భంగం కలిగించినవారిపై న్యాయపరంగా వెళతాం: సీఐ

హిందూపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాను వైసీపీ నాయకుడు మద్యం వ్యాపారి ప్రశాంత్ గౌడ్‌తో మాట్లాడినట్లు ఆ పార్టీ నాయకులు ఓ ఆడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఆ ఆడియోలో తాను బతిమిలాడినట్లు ఉంది. ఆ వాయిస్ తనది కాదని, దానిపై న్యాయపరంగా ముందుకు వెళతానని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య అన్నారు. సోమవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 16న పట్టణంలోని సూర్యా వైన్స్ నుంచి బెల్ట్‌షాపునకు మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా షాప్‌పై కేసు నమోదు చేశామన్నారు. అయితే షాపు యజమాని ప్రశాంత్ గౌడ్ నా పరువుకు భంగం కలిగేలా, నా విధులకు ఆటంకం కలిగేలా ఒక ఆడియోను క్రియేట్ చేసి సోమవారం విలేకరుల సమావేశంలో విడుదల చేశారన్నారు. అది ముమ్మాటికి అవాస్తవమన్నారు. నాకు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవన్నారు. అలా ఉంటే ఏడాదిగా ఆ మద్యం షాపులో అత్యధికంగా వ్యాపారం ఎలా జరుగుతుందని అన్నారు. దీనిపై న్యాపరంగా ముందుకు వెళతానన్నారు. ఇదిలా ఉంటే వైసీపీ నాయకుడు ప్రశాంత్ గౌడ్‌పై హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఫిర్యాదు చేశారు.

కారును ఢీకొన్న బస్సు.. ముగ్గురికి గాయాలు

పెనుకొండ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీవద్ద ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు గోరంట్లకు చెందిన ఇంతియాజ్ అత్త జమీలను అనంతపురం ఆసుపత్రిలో చికిత్సలు చేయిస్తున్నారు. ఆరోగ్యం కుదుటపడటంతో వారు ఇద్దరూ తిరుగు ప్రయాణమయ్యారు. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీవద్దకు రాగానే కియ అనుబంధ పరిశ్రమ సంగు హైటెక్ బస్సు అతివేగంగా ఓవర్‌టేక్ చేయబోయి కారును ఢీకొందన్నారు. ప్రమాదంలో కారులో ఉన్న ఇంతియాజ్, దస్తగిరి, జమీలలు స్వల్పంగా గాయపడ్డారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

గోరంట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో మంత్రి సవిత మంగళవారం పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుమయ్యగారిపల్లి, గోరంట్లలోని వినాయక్ నగర్‌లో ఉపాధి పథకం కింద చేపడుతున్న సీసీరోడ్డు పనులకు మంత్రి భూమి పూజ చేస్తారన్నారు.